సాక్షి
నంద్యాల
శుక్రవారం, 14, ఏప్రిల్, 2023



దత్తాత్రేయస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు.



మట్టి నమూనాల సేకరణ

గోస్పాడు: జిల్లాలో భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాల సేకరణ జరుగుతోంది. గురువారం నెహ్రూనగర్‌లో ఏఓ అబ్దుల్‌హక్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు.



దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి ప్రార్థనలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:38	ఉ॥ 4:39
ఆదోని	సా॥ 6:41	ఉ॥ 4:42
నంద్యాల	సా॥ 6:38	ఉ॥ 4:42
ఆత్మకూరు	సా॥ 6:36	ఉ॥ 4:36
బనగానపల్లె	సా॥ 6:41	ఉ॥ 4:36

హదీస్ వెలుగు :
ఇఫ్తార్ సమయంలో ''యా వాసియల్ ఫజ్లి యఘ్ ఫిర్లి, అస్తగ్ ఫిరుల్లాహ్'' అధికంగా జపించండి. దీనివల్ల మీ పాపాలను అల్లాహ్ దహించివేస్తారు. – పవిత్ర ఖురాన్

పోలీసుల పట్టు.. ముఠా ఆట కట్టు



స్వాధీనం చేసుకున్న గంజాయిని దగ్ధం చేస్తున్న దృశ్యం (ఫైల్)



గత నెలలో గంజాయి ముఠా అరెస్ట్ చూపుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గంజాయి ముఠాలు తమ వ్యాపారాన్ని విస్తృతం చేసుకుని మారుమూల గ్రామాలకు సైతం సరఫరా చేయడంతో ఎంతో మంది మత్తుకు బానిసలయ్యారు. ఆధునిక జీవన ప్రయాణంలో కొందరు యువకులు పెడదోవ పట్టి మత్తు కౌగిలిలో జీవితాలను నాశనం చేసుకున్నారు. గంజాయి బారి నుంచి యువతను రక్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. గంజాయి రహిత రాష్ట్రంగా మార్చాలని ఆదేశించడంతో జిల్లా పోలీసులు గంజాయి విక్రేతలు, వినియోగంపై నిఘా పెట్టి ముఠా మత్తు వదిలించింది.

- జిల్లాలో గంజాయి విక్రయం, వినియోగంపై నిఘా
- ఏడాదిలో 268 కేజీల గంజాయి స్వాధీనం
- కూకటివేళ్లతో గంజాయి ముఠా చైన్ లింక్‌ను తెంచిన పోలీసులు
- ఒకే కేసులో 18 మంది అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా పోలీసులు గంజాయి విక్రేతలపై ఉక్కుపాదం మోపారు. నంద్యాల మీదుగా ఒడిస్సా, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ ఉండటంతో గంజాయి ముఠాలు నంద్యాల ప్రాంతాన్ని అడ్డాగా మార్చారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొచ్చి జిల్లా కేంద్రాల్లో విక్రయాలు జరుపుతున్నట్లు నిఘా విభాగం గుర్తించి సెంట్రల్ క్రైమ్ స్టేషన్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, స్పెషల్ బ్రాంచ్ బృందాలను అప్రమత్తం చేసింది. ఈ బృందాలు విస్తృత నిఘా ఉంచి గంజాయి ముఠా కదలికలను గుర్తించి నంద్యాల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కూకటి వేళ్లతో చైన్ లింక్‌ను తెంచింది. జిల్లాలో ఏడాది కాలంలో 46 గంజాయి కేసులు నమోదు చేశారు. జిల్లా పోలీసులు విస్తృత స్థాయి దాడులు జరిపి గంజాయి రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేశారు. భవిష్యత్తులో తిరిగి గంజాయి విక్రయాలు జరపకుండా నేరస్తులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. జిల్లా ఏర్పాటైన తర్వాత నంద్యాల పరిధిలో 84 మంది గంజాయి వ్యాపారులపై కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు 258 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్‌డ్రైవ్ చేపట్టడంతో పాటు పట్టుకున్న గంజాయిని ఎప్పటికప్పుడు మంటల్లో కాల్చేశారు. ఓ వైపు గంజాయి రవాణాను అడ్డుకున్న పోలీసులు మరోవైపు గంజాయి వినియోగదారులపై నిఘా పెట్టారు. మారుమూల ప్రాంతాల్లో సైతం విక్రయాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆశ్చర్యపోయారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

తీగ లాగారు.. డొంక కదిలింది

గంజాయి ముఠా ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని తీసుకొచ్చి జిల్లాలో కళాశాల విద్యార్థులు, యువతకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు తీగ లాగడంతో డొంక కదిలింది. గత నెల 10వ తేదీన విజయవాడ నుంచి డోన్ వైపు వెళ్తున్న ట్రైన్‌లో గంజాయిని నంద్యాలకు తరలిస్తున్నారని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డికి సమాచారం అందింది. ఈ మేరకు స్థానిక డీఎస్పీ, సీఐలను అప్రమత్తం చేసి రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు చేపట్టడంతో విజయవాడకు చెందిన మహిళతోపాటు వైజాగ్‌కు చెందిన మరో ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. అయితే ముగ్గురిపై కేసు నమోదు చేసి వదిలేయకుండా వాళ్లు జిల్లాలో ఎక్కడెక్కడా గంజాయి విక్రయిస్తున్నారో విచారణ చేశారు. ఈ ముఠా జిల్లాలో బండిఆత్మకూరు మండలానికి చెందిన ఏ కోడూరు, పాణ్యం, ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, ఈర్నపాడు, నంద్యాల పట్టణంతో పాటు, వైఎస్సార్ నగర్ లాంటి ప్రాంతాలకు గంజాయి చేరవేస్తున్నారని గుర్తించారు. ఈ క్రమంలో పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి మూకుమ్మడిగా దాడులు చేశారు. ఈ దాడుల్లో దాదాపు 28 మంది నిందితులను గుర్తించి వారిలో 18 మందిని అరెస్ట్ చేశారు. మరో 10 మంది పరారయ్యారు.

14500 నంబర్‌కు ఫోన్ చేస్తే మత్తు వదిలిస్తారు..

మాదక ద్రవ్యాలను సేవిస్తే భవిష్యత్తులో ఎదుర్కొనే దుష్ఫలితాలను పోలీసులు, వైద్యులతో కలిసి అవగాహన కల్పిస్తున్నారు. మాదక ద్రవ్యాలను సేవించిన మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కుంటే కలిగే నష్టాలను, ఇతర ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు వివరిస్తూ మేల్కొపుతున్నారు. గంజాయి, హాషిష్, కొకైన్, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలు భవిష్యత్తును అంధకారంలోకి నెడతాయని యువత వీటి జోలికి వెళ్లవద్దని సూచనలు ఇస్తున్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు సేవిస్తున్నట్లు తెలిస్తే 14500 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఒక వేళ అలవాటు మానుకోలేని వారు తమను సంప్రదిస్తే ఉచితంగా వైద్యుల వద్దకు తీసుకెళ్లి అలవాటు మానేలా చేస్తామని చెబుతున్నారు. డ్రగ్స్ వాడుతూ పట్టుబడితే వారికి ఏడాది లోపు జైలు శిక్ష ఉంటుందని, డ్రగ్స్ విక్రయించే వారికి 20 ఏళ్ల లోపు జైలు శిక్షలు అనుభవించాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

మాదకద్రవ్యాల జోలికెళితే పీడీ యాక్ట్



ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని తీసుకొచ్చి జిల్లాలో విక్రయించే వారిని గత నెల అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాం. మరికొంత మంది జిల్లాలో సంచరిస్తున్నారనే సమాచారం ఉంది. త్వరలో వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. మత్తుకు బానిసై మాదక ద్రవ్యాలు సేవించినా లేదా విక్రయించినా అటువంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలిస్తాం. గతంలో మాదక ద్రవ్యాల కేసులు నమోదై.. వారి ప్రవర్తనలో మార్పు రాకుంటే జిల్లా బహిష్కరణ చేస్తాం. త్వరలో జిల్లాలో గంజాయి లాంటి మాదకద్రవ్యాలు ఎక్కడా కనిపించకుండా చర్యలు తీసుకుంటాం.

– రఘువీర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ, నంద్యాల

న్యూస్‌రీల్

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి



బేతంచెర్లలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

బేతంచెర్ల: పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బేతంచెర్ల పట్టణంలో సెంట్ ఆన్స్ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంఈఓ సోమశేఖర్, తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి ఉన్నారు.

'మిషన్ వాత్సల్య' దరఖాస్తుకు గడువు పొడిగింపు

కోవెలకుంట్ల: అనాథ పిల్లలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రవేశ పెట్టిన మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగిస్తూ ఐసీడీఎస్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా ఆ గడువును ఈ నెల 26 వరకు పొడిగించింది. పథకానికి సంబంధించి విద్యార్థుల కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా సమకూర్చుకునేందుకు జాప్యమవుతుండటంతో మరో 11 రోజుల పాటు గడువు పొడిగించింది. అర్హులందరికీ ఈ పథకాన్ని వర్తింప చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

98 డీఎస్సీ ఉపాధ్యాయులకు నియామక పత్రాలు



ఎంఈఓ బ్రహ్మం నాయక్ నుంచి పోస్టింగ్ పత్రాలను అందుకున్న దృశ్యం

నంద్యాల(సిటీ): 1998 డీఎస్సీకి సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 200 మంది ఉపాధ్యాయులు నియామక పత్రాలు పొందారని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ గురువారం పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో మినిమం టైం స్కేల్ ప్రకారం ప్రభుత్వం చేపట్టిన నియామకాలకు 209 మందికి గాను 200 మంది హాజరై నియామక పత్రాలు పొందారన్నారు. ఇందులో 123 మంది కర్నూలు జిల్లాకు, 87 మంది నంద్యాల జిల్లాలో రిపోర్టు చేశారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఖాళీల ఆధారంగా వారికి పోస్టింగ్ ఇచ్చామన్నారు. నంద్యాల మండల పరిధిలో ఏడుగురికి నియామక పత్రాలను అందజేసినట్లు ఎంఈఓ బ్రహ్మం నాయక్ తెలిపారు.

పది పరీక్షలకు 310 మంది విద్యార్థులు గైర్హాజర్

నంద్యాల(సిటీ): జిల్లా వ్యాప్తంగా 125 సెంటర్లలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలకు 310 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ తెలిపారు. గురువారం జరిగిన సైన్స్ పరీక్షకు 24,059 మంది విద్యార్థులకు గాను 23,749 మంది హాజరయ్యారన్నారు. మొత్తంగా జిల్లాలో 98.71శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు.

ఓపెన్ పరీక్షలకు 233 గైర్హాజరు

జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న ఓపెన్ పది పరీక్షలకు 1,033 మంది విద్యార్థులకు గాను 931 మంది విద్యార్థులు హాజరు కాగా 102 మంది గైర్హాజరయ్యారు. ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఇంటర్ ఓపెన్ పరీక్షలకు 1,417 మంది విద్యార్థులకు గాను 1,286 మంది హాజరు కాగా 131 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టమ్

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ మనజీర్ జిలానీ, అధికారులు

నంద్యాల: భవిష్యత్‌లో జరిగే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టమ్ అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుంచి ఓటర్లను సుమోటోగా తొలగించకుండా క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. మార్పులు, చేర్పులకు సంబంధించిన పెండింగ్ ఆక్షేపణలు, ఓటర్ గుర్తింపు కార్డుల ప్రింటింగ్, ఎపిక్ కార్డుల పంపిణీ, ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై కలెక్టర్లతో సమీక్షించారు. ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదుకు, చేర్పులు, మార్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పూర్తిస్థాయి విచారణ జరిపి ఓటర్ల జాబితాలో చేర్చాలన్నారు. ఈఆర్‌ఓ నెట్ ఈనెల 17 నుంచి అందుబాటులోకి వస్తుందని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, అభ్యంతరాలపై దృష్టి సారించి పరిష్కరించే దిశలో చర్యలు చేపట్టాలన్నారు. ఎలెక్టోరల్ రోల్, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, ఈవీఎం, ప్లానింగ్, పోలింగ్ సిబ్బంది, లా అండ్ ఆర్డర్, ఎలక్షన్ వ్యయం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ తదితర అంశాలపై పటిష్ట ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫార్మ్-6, 7, 8లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 3,940 దరఖాస్తులను త్వరితగతిన విచారించి ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు, ఎన్నికల సూపరింటిండెంట్ శివరాముడు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకు రూ.2 కోట్లు

- జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు సంబంధించిన పనులకు ఇప్పటి వరకు రూ.2 కోట్ల విలువైన ప్రతిపాదనలు అందాయని జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. ప్రస్తుత వేసవిలో తాగునీటి నివారణకు సంబంధించి ఒక్కో జెడ్పీటీసీ సభ్యునికి రూ.5 లక్షలు జెడ్పీ నిధులను కేటాయిస్తామన్నారు. ఇప్పటి వరకు కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించిన 40 మంది జెడ్పీటీసీ సభ్యుల నుంచి ప్రతిపాదనలు అందాయన్నారు. వీటిని ఆర్‌డబ్ల్యూఎస్ కర్నూలు, నంద్యాల పర్యవేక్షక ఇంజినీర్లకు పంపినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం పరిపాలన ఆమోదం జారీ చేస్తామన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం పెంపు

పాణ్యం: నవధాన్యాల సాగుతో భూసారం పెంచుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ డీపీఎం నరేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆలమూరు గ్రామంలో నవ .దాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగుతో భూమిలోకి వివిధ రకాల వేర్లు వెళ్లడం వల్ల సూక్ష్మ జీవుల మధ్య వైవిధ్యం పెరిగి భూమిలో సేంద్రియ కర్బనం, నేలలో నీటి నిల్వ శాతం పెరుగుతుందన్నారు. నవధాన్యాల సాగు మొ క్కలను పశుగ్రాసం కోసం వాడుకోవచ్చని, అవసరం లేదనుకుంటే పచ్చిరొట్టగా కలియదున్నాలన్నారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యత

ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల నుంచి వెంకటనాయునిపల్లె వరకు రూ.3.50 కోట్లతో 3 కి.మీ మేర నిర్మించిన నూతన రహదారిని గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రితో పాటు రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్ కుమార్, సర్పంచ్ శీలం చంద్రశేఖర్ తదితరులు పాదయాత్రగా వెంకటనాయనిపల్లె చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ జగనన్న సుపరి పాలనలో కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గ్రామీణ ప్రజలకు రహదారులు, రక్షిత మంచినీరు, విద్య, వైద్య సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుందన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. త్వరలోనే అన్ని గ్రామాలకు వాటర్ గ్రిడ్ ద్వారా మంచినీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, పీ.ఆర్ ఈఈ రామకృష్ణారెడ్డి, డీఈఈ నాగిరెడ్డి, ఎఈ మహేష్, రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి శీలం భాస్కర్ నాయుడు, పార్టీ బీసీ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, ఎమ్పీటీసీ సభ్యుడు జానకి రాముడు, స్థానిక నాయకులు అల్లుగుండు రాజు, రామకృష్ణ, అంజనేయులు, పెద్ద నాయుడు త్రినాథ్, రాజేష్, గొల్ల పుల్లయ్య, రంగడు, బాష తదితరులు పాల్గొన్నారు.

అవాస్తవాలు ప్రచురిస్తే చర్యలు తప్పవు

- జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: నిరాధారమైన కథనాలను ప్రచురించిన పత్రికలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి గురువారం హెచ్చరించారు. ఈనెల 6న సాయిబాబానగర్‌కు చెందిన గోపాలకృష్ణ దంపతుల ఇంటిపై మంత్రి పీఏ బంధువులు దాడికి పాల్పడి ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఓ దినపత్రికలో వార్త ప్రచురితమైందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయగా అవాస్తవని తేలిందన్నారు. ఇలాంటి నిరాధారమైన వార్తలు ప్రచురించే ముందు సంబంధిత అధికారుల వివరణ తీసుకోవాలని కోరారు. అలాగే పట్టణంలో బనగానపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు కబ్జాలకు పాల్పడుతున్నట్లు ఈనెల 12వ తేదీన మరో దినపత్రికలో వార్త ప్రచురితమైందన్నారు. విచారణ చేయగా ఎక్కడా భూకబ్జాలు జరగలేదని, ఎవరి వద్దైనా సమాచారం ఉంటే నేరుగా తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఎండలతో ఉక్కిరిబిక్కిరి

- నంద్యాల జిల్లాలో 43.8, కర్నూలు జిల్లాలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉగ్ర భానుడి ధాటికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నంద్యాల జిల్లాలోని గోస్పాడులో అత్యధికంగా 43.8 డిగ్రీలు, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరులో అత్యధికంగా 43.23 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కర్నూలులో రాత్రి ఉష్ణోగ్రత 26.1 డిగ్రీలకు చేరుకుంది. ఈ నేపథ్యంలో గృహ విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

ప్రాంతం	ఉష్ణోగ్రత
బనగానపల్లె	43.66
గాజులపల్లి (మహానంది మండలం)	43.57
గుళ్లదుర్తి (కోవెలకుంట్ల మండలం)	43.34
బొల్లవరం (నందికొట్కూరు మండలం)	43.22
పగిడ్యాల	43.21
కొత్తపల్లి	43.4
కర్నూలు	42.7
లద్దగిరి (కోడుమూరు మండలం)	42.7
జి.సింగవరం(కర్నూలు మండలం)	42.13
చిన్నతుంబలం (పెద్దకడుబూరు మండలం)	42.0
కామవరం (కౌతాళం మండలం)	41.9

పార్టీని మరింత బలోపేతం చేద్దాం





మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి , హాజరైన పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్లు

- వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్లు అమర్నాథ్‌రెడ్డి, చల్లా మధుసూదన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి, గృహ సారథుల కో ఆర్డినేటర్ (కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు) చల్లా మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి కర్నూలు జిల్లా నియోజకవర్గ పరిశీలకుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నతాశయంతో పార్టీని స్థాపించారని, ఆయన లక్ష్యాల మేరకు పనిచేయాలన్నారు. పార్టీ ఏర్పడినప్పటి నుంచి పేదల సంక్షేమమే అజెండాగా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రధాన దృష్టి కేంద్రీకరించారన్నారు. సంక్షేమ పథకాల కోసమే రూ.2 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత, అభిమానం పెరిగిపోతోందన్నారు. అయితే టీడీపీ నేతలు ప్రభుత్వంపై విషం చిమ్మేందుకు ఎల్లో మీడియాను వాడుకుంటున్నారన్నారు. ప్రతిపక్ష నేతల కుట్రలను, ఎల్లో మీడియా విష ప్రచారాన్ని తిప్పికొడుతూ అధిష్టానం సూచించిన కార్యక్రమాలను సమన్వయంతో జయప్రదం చేయాలన్నారు. పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య మాట్లాడుతూ.. వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో 175 సీట్లలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మిగనూరు పరిశీలకుడు ఎర్రబోతుల పాపిరెడ్డి, ఇతర నియోజకవర్గ పరిశీలకులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి (కర్నూలు), గోకుల్ కృష్ణారెడ్డి (పాణ్యం), వెన్నపూస రవీంద్రారెడ్డి (పత్తికొండ), మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (కోడుమూరు), వంగాల భరత్ కుమార్‌రెడ్డి (మంత్రాలయం), మలికిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి (ఆలూరు), పోరెడ్డి నరసింహారెడ్డి (ఆళ్లగడ్డ), తెర్నెకల్ సురేందర్‌రెడ్డి (శ్రీశైలం), మహాలక్ష్మీ శ్రీనివాస్ (నంద్యాల), టీకే అఫ్జల్ ఖాన్ (బనగానపల్లె), కోన మురళీధర్‌రెడ్డి (డోన్) పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై కేసు నమోదు

పత్తికొండ రూరల్: స్థానిక షాదీఖానా వెనుక భాగంలో చెరువు కడగొమ్మును మట్టితో పూడ్చివేసిన ఘటనపై సాబ్దిన్ నూర్‌బాషా, మరికొందరిపై ఇరిగేషన్ డీఈ చంద్ర శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీమోహన్ గురువారం తెలిపారు. కడగొమ్ము పూడ్చివేతకు గురైన విషయం తెలుసుకున్న అధికారులు వెళ్లి మట్టిని తొలగించాలని ఆదేశించారు. వారి ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆక్రమణదారులు స్థలంలో నిర్మాణాలకు పూనుకోవడంతో అధికారులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.


కలెక్టరేట్ ఆవరణలో పిచ్చిమొక్కలతో నిండిపోయిన ఫౌంటెన్


సమాచార భవన్ ఆవరణలో గుట్టలుగా మద్యం సీసాలు


ఎక్కడ ఖాళీ ఉంటే.. అక్కడ చెత్త

కలెక్టరేట్ కాదు.. చెత్తబుట్ట!


అడుగడుగునా చెత్తాచెదారం


కలెక్టర్, జేసీ చాంబర్ల దగ్గర తుప్పుపట్టిన కుర్చీలు


ఏ మూల చూసినా పేరుకుపోయిన వ్యర్థాలు

కార్యాలయం ఇంటితో సమానం. పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యం బాగుంటుంది. జిల్లా కలెక్టరేట్ అన్ని ప్రభుత్వ శాఖలకు కేంద్ర బిందువు. నియోజకవర్గ, మండల స్థాయి ఉద్యోగులకు ఆదర్శం. జిల్లా తొలి మహిళా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.సృజన.. మొదటి రోజు నుంచే కార్యాలయాన్ని ఇంటిగా చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు. వారం రోజుల గడువు ఇచ్చి, ఎక్కడా చెత్తాచెదారం కనిపించరాదని, మార్పు రాకపోతే జరిమానా విధిస్తానని హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికి నాలుగు రోజులు గడిచినా, ఒక్కరంటే ఒక్కరిలోనూ కదలిక లేకపోవడం చూస్తే కలెక్టర్ ఆదేశాలకు ఏమాత్రం విలువ ఇస్తున్నారో అర్థమవుతోంది. అడుగడుగునా చెత్తాచెదారం.. కనీసం కూర్చునే కుర్చీలు కూడా దుమ్ము పట్టిపోయాయి. గోడలకు ఎక్కడ చూసినా పాన్‌పారాగ్ మరకలే.. కిటికీల పక్కన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ఇక కీలకమైన సమాచార శాఖ వద్ద ఏకంగా మద్యం బాటిళ్లు కనిపించడం చూస్తే ఈ ప్రాంతంలో భద్రత ఏస్థాయిలో ఉందో తెలుస్తోంది. ఫొటోలు: వడ్డె శ్రీనివాసులు


సునయన ఆడిటోరియంకు వెళ్లే దారిలో లీక్ అవుతున్న నీరు


కలెక్టరేట్ చుట్టూ అపరిశుభ్ర వాతావరణమే..


ఎక్కడ చూసినా తాగిపడేసిన పేపర్ టీ గ్లాసులు, వాటర్ బాటిళ్లు


తుప్పు పట్టిన ప్రభుత్వ వాహనాలు


కార్యాలయంలో కుక్క సంచారం


ఉద్యోగుల భద్రత గాలిలో దీపం..

కోవెలకుంట్ల ఆసుపత్రిలో తొలి సిజేరియన్


సిజేరియన్ అనంతరం తల్లి, బిడ్డతో వైద్య సిబ్బంది

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం చేసిన తొలి సిజేరియన్ ఆపరేషన్ విజయవంతమైంది. నాడు– నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి అన్ని వసతులు, వైద్య పరికరాలతో పాటు ఆయా విభాగాలకు ప్రభుత్వం డాక్టర్లను నియమించింది. సంజామల మండలం గిద్దలూరు గ్రామానికి చెందిన ప్రవల్లిక ప్రసవ నొప్పులతో ఆసుపత్రిలో చేరింది. సాధారణ కాన్పు కష్టతరం కావడంతో సిజేరియన్ చేయాల్సి వచ్చింది. మత్తుమందు డాక్టర్ వెంకటలక్ష్మి, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్వేత శాలిని ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సులు ఇందిర, జ్యోతి, థియేటర్ అసిస్టెంట్లు మంజుల, బాష, ప్రవల్లికకు సిజేరియన్ చేయగా గర్భిణి ప్రవల్లిక ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఆసుపత్రిలో తొలి సిజేరియన్ విజయవంతం కావడంతోఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి వైద్య సిబ్బందిని అభినందించారు.

108లో ప్రసవం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లకు చెందిన కల్యాణి గురువారం 108 అంబులెన్స్‌లో ఆడబిడ్డను ప్రసవించింది. తెల్లవారుజామున ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 వాహనం కోసం ఫోన్ చేశారు. తక్షణమే స్పందించిన సిబ్బంది వారి ఇంటి వద్దకు చేరుకొని గర్భిణిని ఎక్కించుకుని అనంతపురం జిల్లా తాడిపత్రి ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలోనే అంబులెన్స్‌లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సురక్షితంగా ప్రసవం అయ్యేందుకు కృషి చేసిన 108 సిబ్బంది ఈఎంటీ రవి, పైలెట్ చిన్నయ్యకు కల్యాణి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లు లక్ష్యంగా చోరీలు

- ఇద్దరు అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్


పట్టుబడిన దుద్దేర లింగం, గైకవాడ మహేష్ బాబు

కర్నూలు: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను మూడవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లా కొండపాకకు చెందిన దుద్దేరలింగం(50) హైదరాబాద్‌లోని అమీర్‌పేట్, ఎల్బీ నగర్, ఏపీలోని గుంటూరు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. అక్కడ పోలీసుల నిఘా పెరగడంతో కొంతకాలంగా నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె గ్రామంలో ఉంటూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు నేరాలకు పాల్పడ్డారు. డోన్‌లోని ఓ ఇంటి దొంగతనంలో అరెస్టయి డోన్ సబ్ జైలులో ఉండగా అదే జైలులో శిక్ష అనుభవిస్తున్న కర్నూలు నగరం స్వామిరెడ్డి నగర్‌కు (ప్రస్తుతం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని అరుంధతి కొట్టాలు) చెందిన పాత నేరస్తుడు గైకవాడ మహేష్ బాబు అలియాస్ పచ్చబొట్ల మహేష్‌తో పరిచయం పెరిగింది. ఇద్దరూ బెయిల్‌పై బయటకు వచ్చి జల్సాల కోసం డబ్బు అవసరమైనప్పుడల్లా ఇళ్లలో దొంగతనాలు చేస్తున్నారు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా పక్కా ఆధారాలతో నంద్యాల చెక్ పోస్టు సమీపంలో ఉన్న రాయల్ గ్రానైట్ దుకాణం వద్ద ఇరువురినీ అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లో గౌరీ మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌లో రూ.1.80 లక్షల చోరీ చేశారు. మార్చి 20వ తేదీన నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని బృందావన్ నగర్‌లో పింజరి అక్రమ్ ఇంట్లో రూ.లక్ష విలువ చేసే బంగారు నగలు ఎత్తుకెళ్లారు. కర్నూలు రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఫొటో స్టూడియోలో రూ.4 లక్షలు దొంగతనం చేసినట్లు అంగీకరించారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి జైలుకు పంపినట్లు మూడవ పట్టణ సీఐ తబ్రేజ్ తెలిపారు. సాంకేతిక సాయంతో నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదుతో పాటు నగలను రికవరీ చేసిన ఎస్ఐ పి.వెంకట సురేష్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ సింగ్, కానిస్టేబుళ్లు నాయుడు, కిషోర్‌లను సీఐ తబ్రేజ్ అభినందించారు.

అప్పులు కూడా ఇస్తారు

దుద్దేరలింగం ఇళ్లతో పాటు రైళ్లలో కూడా చోరీలకు పాల్పడినట్లు విచారణలో బయటపడింది. ఇతను చిన్నవయస్సులోనే నేరాల బాట పట్టి పలుసార్లు జైలు జీవితం గడిపాడు. చోరీ చేసిన సొమ్ముతో జల్సాలు చేయడమే కాక బుగ్గానపల్లిలో కొంతమందికి అప్పులు కూడా ఇచ్చినట్లు పోలీసు విచారణలో వెలుగుచూసింది.

ఉత్తమ సేవలకు పతకాలు

- జిల్లాలో పలువురు పోలీసు అధికారులు, పోలీసులకు ఉగాది పురస్కారాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు పోలీసు అధికారులు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ కానిస్టేబుళ్లకు ఉగాది పురస్కారాలు లభించాయి. ఈ మేరకు హోమ్ శాఖ ఈనెల 13న జీఓ 71 జారీ చేసింది.

ఉత్తమ సేవా పతకం: శివప్రసాద్, ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ (ఏఆర్ఎస్ఐ) ఎల్.తిరుపాల్ రెడ్డి (హెచ్‌సీ)

సేవా పతకాలు:
విక్రమ సింహ (కర్నూలు వన్‌టౌన్ సీఐ), చిరంజీవి (ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఐ), వెంకటేశ్వర్లు (ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ ఆర్ఎస్ఐ), కరీంబాషా (కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ), ఎం.కృష్ణ (తాలూకా పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్), రామకృష్ణ (ట్రాఫిక్ ఏఎస్ఐ) నరేష్ (ఉలిందకొండ పోలీస్ కానిస్టేబుల్), ఎం.వెంకటేశ్వర్లు (బనగానపల్లె ఏఎస్ఐ) విద్యాసాగర్ (మహానంది హెడ్‌కానిస్టేబుల్), కృష్ణమూర్తి (రేవనూరు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్) చెన్నయ్య (ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ ఏఆర్ఎస్ఐ), కె.కృష్ణుడు (హెడ్ కానిస్టేబుల్)

ఉత్తమ సేవా పతకం(ఫైర్ డిపార్ట్‌మెంట్), డి.ఏసురత్నం (ఆదోని అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్).

సేవా పతకం(ఫైర్ డిపార్ట్‌మెంట్)
కేపీ శివయ్య (ఆదోని ఫైర్ స్టేషన్ డ్రైవర్), యోగేశ్వర్‌రెడ్డి (నంద్యాల సహాయ ఫైర్ ఆఫీసర్), ఎం.నరసింహులు (బనగానపల్లె స్టేషన్ ఫైర్ ఆఫీసర్), బి.వెంకటేశ్వర్లు (నంద్యాల ఫైర్ స్టేషన్ డ్రైవర్).

సేవా పతకం(విజిలెన్స్ డిపార్ట్‌మెంట్):
కానిస్టేబుళ్లు ఎం.రామచంద్రుడు, జి.సుబ్బరాయుడు, డి.జమాన్

సేవా పతకం(ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు):
హెడ్ కానిస్టేబుల్ పి.మునీశ్వరరెడ్డి.

విభేదాలతో స్వాగతం

- తొలిరోజు యువగళం పాదయాత్రకు స్పందన కరువు
- జనాలను తరలించిన టీడీపీ నేతలు


ఉమ్మడి కర్నూలు జిల్లాలోకి ప్రవేశించిన నారా లోకేష్ యువగళం పాదయాత్ర


పాదయాత్రకు జనాన్ని తరలించిన వాహనాలు

ప్యాపిలి/డోన్ టౌన్: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర గురువారం ప్యాపిలి మండలం డి.రంగాపురం వద్ద అనంతపురం జిల్లా నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలోకి ప్రవేశించింది. తొలి రోజే టీడీపీ నాయకుల మధ్య విభేదాలు కనిపించాయి. డోన్ నియోజకవర్గ నేత ధర్మారం సుబ్బారెడ్డితో పాటు జిల్లాలోని పలు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు ఒకే చోట కూర్చొని నారా లోకేష్ రాక కోసం ఎదురు చూశారు. అయితే కేఈ ప్రభాకర్ మాత్రం ప్రత్యేకంగా శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడే తన వర్గీయులతో కూర్చొన్నారు. కోట్ల వర్గీయుల్లో కొంత మంది ధర్మారం సుబ్బారెడ్డి గ్రూపులో కలువలేదు. పాదయాత్రకు ప్రజలు లేకపోవడంతో హడావుడిగా నేతలు వివిధ ప్రాంతాల నుంచి జనాలను తరలించారు. వారు కొద్ది సేపు మాత్రమే ఉండడంతో పాదయాత్ర బోసిపోయింది. ఇదిలా ఉండగా మొదటి రోజు లోకేష్ పాదయాత్ర డి.రంగాపురం, నల్లమేకలపల్లి, జక్కసానికుంట్ల, పీఆర్ పల్లె మీదుగా గుడిపాడు వరకు సాగింది. జక్కసానికుంట్ల వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నారా లోకేష్ ఎస్సీ సామాజికవర్గం ప్రతినిధులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమే కారణం?


సంతోష్‌నాయక్ (ఫైల్)

శ్రీశైలం: శ్రీశైల క్షేత్ర పరిధిలోని ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసుల సమాచారం మేరకు.. దేవస్థానంలో తోటమాలిగా పని చేసే సంతోష్‌కుమార్‌నాయక్ (26) దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఓ యువతిని ప్రేమించాడు. ఆమెతో ఫొటోలు దిగడం, ఆమె వద్ద నుంచి రూ. లక్ష వరకు నగదు తీసుకున్నట్లు సమాచారం. కాగా అమ్మవారి ఆలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న మరో ఉద్యోగికి ఈ యువతికి మధ్య కూడా ప్రేమ ఉన్నట్లు తెలిసింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రెండు రోజుల క్రితం సంతోష్‌కుమార్ నాయక్ వద్దకు వెళ్లి సదరు యువతిని పెళ్లి చేసుకుంటున్నానని, ఆమెతో దిగిన ఫొటోలు ఉన్న సెల్ ఇవ్వాలని కోరడంతో పాటు రూ. లక్ష కూడా విడతల వారీగా చెల్లించాలన్నాడు. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు కాని.. సంతోష్ కుమార్ గురువారం ఉదయం ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని అటవీమార్గంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోలీసులు ప్రాజెక్ట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబీకులు, బంధువులు ఆసుపత్రి వద్దకు చేరి సంతోష్‌కుమార్ ఆత్మహత్యకు కారణమైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.